జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435


PUBLISH IN HYDERABADH | సంపుటి : 01 సంచిక : 194 | SANDESHAM TIMES | బుధవారం 10 - 12 - 2025 | SANDESHAM TIMES TELUGU DAILY

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

# చంద్రబాబు పాలనలోనే అది సాధ్యం

## పీ–4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ కుటుంబరావు

- గత ఐదేళ్లలో ఏపీ జీఎస్డీపీకి రూ.7 లక్షల కోట్లకు పైగా నష్టం అని వెల్లడి
- 18 నెలల చంద్రబాబు పాలనలోనే ఆర్థిక వ్యవస్థ మళ్లీ పుంజుకుందన్న కుటుంబరావు
- జగన్ దుర్మార్గ పాలన వల్లే రాష్ట్రం వెనుకబడిపోయిందని విమర్శలు
- చంద్రబాబు నాయకత్వంలోనే స్వర్ణాంధ్ర సాధ్యమని వెల్లడి



**ఆంధ్రప్రదేశ్, సందేశం టైమ్స్ :**
గత ఐదేళ్ల విధ్వంసకర పాలన నుంచి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ బయటపడి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో తిరిగి వికాస పథంలోకి ప్రవేశించిందని స్వర్ణాంధ్ర పీ–4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ సి.కుటుంబరావు అన్నారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కీలక గణాంకాలను వెల్లడించారు. చంద్రబాబు వెల్లడించిన ఆర్థిక గణాంకాలే రాష్ట్ర పురోగతికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు నాయకత్వంలోనే స్వర్ణాంధ్ర సాధ్యమని అన్నారు. 2019–2024 మధ్య జగన్ పాలనలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ)కి రూ.7 లక్షల కోట్లకు పైగా తీవ్ర నష్టం వాటిల్లిందని కుటుంబరావు ఆరోపించారు. ప్రతి ఏటా లక్ష నుంచి లక్షన్నర కోట్లు పెరగాల్సిన జీఎస్డీపీ తగ్గిపోవడంతో, రాష్ట్ర సొంత ఆదాయంలో రూ.70 వేల కోట్లకు పైగా కోత పడిందన్నారు. గత ప్రభుత్వం సక్రమంగా పనిచేసి ఉంటే, ఖజానాకు అదనంగా రూ.72 వేల కోట్లు వచ్చి ఉండేవని ఆయన విశ్లేషించారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణతో పోల్చినప్పుడు ఈ తేడా మరింత స్పష్టంగా కనిపిస్తోందని ఆయన వివరించారు. 2014–19 మధ్య ఏపీ జీఎస్డీపీ వృద్ధి రేటు 13.21 శాతం ఉండగా, తెలంగాణది 13.5 శాతం అని, దాదాపు సమానంగా ఉన్నాయని తెలిపారు. కానీ, 2019–24 మధ్య జగన్ పాలనలో ఏపీ వృద్ధి రేటు 9.1 శాతానికి పడిపోగా, తెలంగాణ 11 శాతం వృద్ధిని నమోదు చేసిందని పేర్కొన్నారు. దీని ఫలితంగా ఏపీ తలసరి ఆదాయం రూ.2.66 లక్షల వద్దే ఆగిపోగా, తెలంగాణ రూ.3.87 లక్షలకు చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు తిరిగి అధికారం చేపట్టిన 18 నెలల్లోనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టారని కుటుంబరావు ప్రశంసించారు. వ్యవసాయ రంగంలో 34–35 శాతం జీఎస్డీపీ లక్ష్యంలో ఇప్పటికే 65 శాతం

మిగతాది 2 లో...


## భారత్‌లో మైక్రోసాఫ్ట్ అత్యంత భారీ పెట్టుబడి

### భారత్‌లో రూ.1.5 లక్షల కోట్ల భారీ పెట్టుబడి ప్రకటించిన మైక్రోసాఫ్ట్

ప్రధాని మోదీతో భేటీ అనంతరం సీఈఓ సత్య నాదెళ్ల వెల్లడి

ఆసియాలోనే ఇదే అతిపెద్ద పెట్టుబడి అని ప్రకటన

ఏఐ మౌలిక వసతులు, నైపుణ్యాల అభివృద్ధికి ఈ నిధులు



**జాతీయం, సందేశం టైమ్స్ :**
ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ భారత్‌లో అత్యంత భారీ పెట్టుబడికి సిద్ధమైంది. దేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాన్ని బలోపేతం చేసేందుకు ఏకంగా రూ.1.5 లక్షల కోట్లు (17.5 బిలియన్

మిగతాది 2 లో...

## ఇండిగోపై కఠిన చర్యలు తప్పవు

- ఇండిగో వైఫల్యాలపై కేంద్రం కఠిన వైఖరి
- ప్రణాళికా లోపాలను ఉపేక్షించేది లేదన్న మంత్రి రామ్మోహన్ నాయుడు
- ఇప్పటికే ప్రయాణికులకు రూ.750 కోట్లకు పైగా రిఫండ్
- రోజువారీ సర్వీసుల్లో 5 శాతం కోత విధించిన డీజీసీఏ
- మంత్రి ప్రకటన తర్వాత సభ నుంచి విపక్షాల వాకౌట్

**జాతీయం, సందేశం టైమ్స్ :**
దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో కార్యకలాపాలు క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని, అయితే ప్రణాళికా లోపాల కారణంగా ప్రయాణికులకు కలిగించిన తీవ్ర ఇబ్బందులకు సంస్థను బాధ్యుల్ని చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.



2

## కేసీఆర్ ఆరోగ్యంగా ఉన్నారు

### ఎప్పుడు రావాలో అప్పుడు వస్తారు: హరీశ్ రావు

కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ప్రజలు ఎదురుచూస్తున్నారన్న హరీశ్

కేసీఆర్ దీక్ష వల్లే తెలంగాణ సాధ్యమైందని వ్యాఖ్య

తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ కోసం మరో పోరాటానికి పిలుపు

**తెలంగాణ, సందేశం టైమ్స్ :**
తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ కోసం ప్రజలు మరో పోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం వచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ

మిగతాది 2 లో...




## హైకోర్టుకు సీల్డ్ కవర్‌లో సీఐడీ అదనపు నివేదిక

టీటీడీ మాజీ ఉద్యోగి విదేశీ కరెన్సీ చోరీ చేసిన కేసు

రూ.14 కోట్ల ఆస్తుల విరాళంతో కేసు రాజీపై ఆరోపణలు

ఫిర్యాదుదారు అనుమానాస్పద మృతితో పెరిగిన కేసు తీవ్రత



**ఆంధ్రప్రదేశ్, సందేశం టైమ్స్ :**
తిరుమల శ్రీవారి పరకామణి చోరీ కేసులో లోక్ అదాలత్ ద్వారా కుదిరిన రాజీ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో విచారణ కొనసాగుతోంది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీఐడీ ఈరోజు హైకోర్టుకు అదనపు నివేదికను సీల్డ్ కవర్‌లో సమర్పించింది. ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును

మిగతాది 2 లో...

## ఇండిగోను తక్షణమే జాతీయం చేయండి

- విమానాల రద్దు, ఆలస్యంపై ఇండిగోకు కేంద్రం షాక్
- ఫ్లైట్ స్లాట్లలో 5 శాతం కోత విధించిన డీజీసీఏ
- ఇండిగో యాజమాన్యం బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతోందన్న నారాయణ

**జాతీయం, సందేశం టైమ్స్ :**
ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో ఎయిర్‌లైన్స్‌పై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. దేశవ్యాప్తంగా వందలాది విమానాలను రద్దు చేయడం, ఆలస్యంగా నడపడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు



మిగతాది 2 లో...

# కేసీఆర్ ఆరోగ్యంగా ఉన్నారు

భవన్‌లో నిర్వహించిన 'విజయ దీక్షా దివస్' కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత రెండేళ్లుగా రేవంత్ రెడ్డి తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. "తెలంగాణ ఉద్యమ ద్రోహుల చరిత్ర రాస్తే, అందులో రేవంత్ రెడ్డి పేరే రాయాల్సి వస్తుంది. రేవంత్ రెడ్డి అంటే ద్రోహి, వెన్నుపోటు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చే హక్కు ఆయనకు లేదు" అని మండిపడ్డారు. కాళోజీ, దాశరథి, గద్దర్ అవార్డులను కాదని, రామోజీరావు కంటే గొప్ప అవార్డు లేదని రేవంత్ మాట్లాడటం రాష్ట్ర పురస్కారాలను అవమానించడమేనని అన్నారు. కేసీఆర్ త్యాగం వల్లే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని హరీశ్‌రావు గుర్తుచేశారు. "కేసీఆర్ దీక్ష చేయకపోతే తెలంగాణ ప్రకటన వచ్చేది కాదు. పదవులను గడ్డిపోచలా వదిలేసిన వ్యక్తి కేసీఆర్. నిమ్స్‌లో ప్రాణాల మీదకు వచ్చినా దీక్ష విరమించలేదు. అలాంటి కేసీఆర్‌ను ప్రజల ఆశీర్వాదం కాపాడుతోంది. ఆయన ఆరోగ్యం బాగుంది. ఆయన ఎప్పుడు రావాలో అప్పుడే వస్తారు" అని తెలిపారు. ప్రజలకు పాలకుల మధ్య తేడా ఇప్పటికే అర్థమైందని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ఉద్యమ చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణను కాపాడుకోవడానికి అందరూ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఇండిగోపై కఠిన చర్యలు తప్పవు

మంగళవారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ, నిబంధనలు పాటించని ఏ ఎయిర్‌లైన్స్ సంస్థను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సంక్షోభం నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), ఇండిగోకు షోకాజ్ నోటీసులు జారీ చేసిందని, దీనిపై సమగ్ర విచారణ జరుగుతోందని మంత్రి తెలిపారు. నివేదిక ఆధారంగా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరోవైపు ఇండిగో తన రోజువారీ సర్వీసుల్లో 5 శాతం కోత విధించాలని డీజీసీఏ ఆదేశించింది. షెడ్యూళ్లను సమర్థంగా నిర్వహించడంలో ఇండిగో విఫలమైందని డీజీసీఏ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇప్పటికే ప్రయాణికులకు రూ.750 కోట్లకు పైగా రిఫండ్ చేసినట్లు ఇండిగో తెలిపిందని రామ్మోహన్ నాయుడు సభకు వివరించారు. ఈ నెల 5 నుంచి 15 వరకు రద్దయిన విమానాల రిఫండ్లు, బ్యాగేజీ సమస్యలు మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని ప్రయాణికులను ఆదుకోవడానికి విమాన టికెట్ల ధరలపై పరిమితులు విధించిందని, ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండా రీబుకింగ్‌లు చేశారని తెలిపారు. పైలట్లు, సిబ్బంది రోస్టరింగ్ నిబంధనల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. మంత్రి ప్రకటన అనంతరం కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. దేశంలో పటిష్ఠమైన, ప్రయాణికులే ప్రథమ ప్రాధాన్యతగా ఉండే విమానయాన రంగాన్ని నిర్మించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.

## భారత్‌లో మైక్రోసాఫ్ట్ అత్యంత భారీ పెట్టుబడి

డాలర్లు) పెట్టుబడిగా పెట్టనున్నట్లు ప్రకటించింది. మంగళవారం నాడు ప్రధాని నరేంద్ర మోదీతో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల సమావేశమైన అనంతరం ఈ కీలక ప్రకటన వెలువడింది. ఆసియాలోనే మైక్రోసాఫ్ట్ పెడుతున్న అతిపెద్ద పెట్టుబడి ఇదేనని సత్య నాదెళ్ల తెలిపారు. రానున్న నాలుగేళ్లలో (2026-2029) ఈ నిధులను వెచ్చించనున్నట్లు కంపెనీ పేర్కొంది. ఈ పెట్టుబడి ద్వారా భారత్‌లో ఏఐకి అవసరమైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యాల అభివృద్ధి, సామర్థ్యాల పెంపునకు కృషి చేస్తామని ఆయన వివరించారు. ఈ సమావేశంపై సత్య నాదెళ్ల ఎక్స్ వేదికగా స్పందిస్తూ, "భారత్ ఏఐ అవకాశాలపై ప్రధాని మోదీతో స్ఫూర్తిదాయకమైన చర్చ జరిగింది. దేశ ఆశయాలకు మద్దతుగా ఈ పెట్టుబడి పెడుతున్నాం" అని పేర్కొన్నారు. ఈ ప్రకటనపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. "ఏఐ విషయంలో ప్రపంచం భారత్ వైపు ఆశాభావంతో చూస్తోంది. సత్య నాదెళ్లతో ఫలవంతమైన చర్చ జరిగింది. ఆసియాలోనే అతిపెద్ద పెట్టుబడికి భారత్‌ను ఎంచుకోవడం సంతోషకరం" అని మోదీ తన పోస్ట్‌లో తెలిపారు. దేశ యువత ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని, ఏఐ శక్తిని సృజనాత్మకంగా వినియోగించుకుంటుందన్న విశ్వాసాన్ని ప్రధాని వ్యక్తం చేశారు. ఇప్పటికే భారత్‌లో హైదరాబాద్, పుణే వంటి నగరాల్లో బలమైన కార్యకలాపాలు నిర్వహిస్తున్న మైక్రోసాఫ్ట్ తాజా పెట్టుబడి... దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు, స్టార్టప్‌లకు భారీ ఊతమిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## హైకోర్టుకు సీల్డ్ కవర్‌లో సీఐడీ అదనపు నివేదిక

విచారిస్తోంది. సీఐడీ సమర్పించిన నివేదికకు చెందిన మరో రెండు సెట్లను రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) కు సీల్డ్ కవర్‌లో ఇవ్వాలని ఆదేశించింది. ఈ నివేదికలను పరిశీలన నిమిత్తం తమ ముందు ఉంచాలని రిజిస్ట్రీకి సూచించింది. లోక్ అదాలత్ అవార్డు చట్టబద్ధతపైనే ప్రధానంగా దృష్టి సారించిన న్యాయస్థానం, నివేదికను పరిశీలించాక తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేసింది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. గత ఏడాది ఏప్రిల్‌లో టీటీడీ మాజీ ఉద్యోగి రవికుమార్ సుమారు 900 అమెరికన్ డాలర్ల విదేశీ కరెన్సీని చోరీ చేస్తూ పట్టుబడ్డారు. అయితే, 2023 సెప్టెంబర్‌లో ఈ కేసు అనూహ్యంగా లోక్ అదాలత్‌లో రాజీకి వచ్చింది. ఈ రాజీలో భాగంగా నిందితుడు రవికుమార్ రూ.14 కోట్ల విలువైన ఏడు ఆస్తులను టీటీడీకి విరాళంగా ఇచ్చారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ రాజీని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు కావడంతో న్యాయస్థానం సీఐడీ, ఏసీబీ దర్యాప్తునకు ఆదేశించింది. మరోవైపు, ఈ కేసులో తొలుత ఫిర్యాదు చేసిన అప్పటి ఏవీఎస్ఓ సతీశ్ కుమార్ అనుమానాస్పద స్థితిలో మరణించడం కేసు తీవ్రతను మరింత పెంచింది.

## ఇండిగోను తక్షణమే జాతీయం చేయండి



కలుగుతున్న నేపథ్యంలో డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) క్రమశిక్షణా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇండిగోకు కేటాయించిన స్లాట్లలో 5 శాతం మేర కోత విధిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. డీజీసీఏ తాజా నిర్ణయంతో ఇండిగో నడిపే విమానాల సంఖ్యలో సుమారు 110 సర్వీసులు తగ్గే అవకాశం ఉంది. ప్రయాణికులకు కలుగుతున్న అసౌకర్యాన్ని తీవ్రంగా పరిగణించిన కేంద్రం ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, ఇండిగో వైఖరిపై రాజకీయ నేతల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సీపీఐ అగ్రనేత నారాయణ ఈ విషయంపై ఘాటుగా స్పందించారు. ఇండిగో సంస్థను తక్షణమే జాతీయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రయాణికుల భద్రత కోసం కేంద్రం విధించిన నిబంధనలను పాటించకుండా ఇండిగో యాజమాన్యం బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. పౌర విమానయాన రంగంలో ఇండిగోకు 64 శాతం వాటా ఉందని, ప్రభుత్వ రంగంలో విమానయాన సంస్థలు లేకపోవడం వల్లే ఇలాంటి సంక్షోభాలు తలెత్తుతున్నాయని నారాయణ విమర్శించారు.

# చంద్రబాబు పాలనలోనే అది సాధ్యం



చేరుకున్నామని, పరిశ్రమల రంగంలో 45 శాతం లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. ఐటీ, టూరిజం, లాజిస్టిక్స్ వంటి సేవల రంగం నిర్దేశిత లక్ష్యాన్ని మించి రాణించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దడం, ఏపీ లాజిస్టిక్ కార్పొరేషన్‌ను క్రమబద్ధీకరించడం వంటి ప్రణాళికలతో ముందుకు వెళుతున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో జల్ జీవన్ మిషన్, పీఎం ఆవాస్ యోజన వంటి కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా ఇవ్వలేదని, పునరుత్పాదక ఇంధన సంస్థలను బ్లాక్‌మెయిల్ చేసి, పరిశ్రమలను బెదిరించి తరిమేశారని కుటుంబరావు తీవ్రంగా విమర్శించారు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించిందని, గ్రీన్ ఎనర్జీలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు. విమానయాన రంగంలో అత్యధిక వృద్ధి, మైనింగ్, గ్రానైట్ ఉత్పత్తిలో పెరుగుదల వంటివి ప్రభుత్వ విజయాలకు నిదర్శనమన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ మాదిరిగా, రాష్ట్రంలో చంద్రబాబు తన దార్శనికత, పటిష్ఠమైన నాయకత్వంతో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దుతున్నారని ఆయన కొనియాడారు.

## విజయవాడ పశ్చిమ నియోజకవర్గం లో స్వచ్ఛ సైనికులకు సన్మానం.



**స్రందేశం టైమ్స్ విజయవాడ వెస్ట్, డిసెంబర్ 10 :** విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ సిబ్బంది ని, పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయం లో ఘనంగా సత్కరించారు. జాతీయ స్థాయిలో స్వచ్ఛ భారత్ అభియాన్ క్రింద నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ర్యాంకింగ్ నిర్వహించింది. భారత ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షన్ లో 7 స్టార్ రేటింగ్ ప్రకటించిన ర్యాంకులలో విజయవాడ కార్పొరేషన్ కు 4 వ స్థానం దక్కింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నగరంలోని 42 వ డివిజన్ పరిధిలో పని చేసే శానిటేషన్ కార్మికులను, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుల యలమంచలి సత్యన్నారాయణ చౌదరి (వైయస్ సుజనా చౌదరి) ఆధ్వర్యంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ యన్ డి ఏ నాయకుల ద్వారా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 42 వ డివిజన్ శానిటరీ ఇన్సెపెక్టర్ దుర్గారావు తో పాటూ మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య, 42 వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షురాలు తిరుపతి అనుష, 42 వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పత్తి నాగేశ్వరరావు, 42 వ డివిజన్ బి జె పి పార్టీ అధ్యక్షులు బెన్నాబక్తుల సోమేశ్వరరావు వియంసి మాజీ స్టాండింగ్ కమిటి మెంబర్ దాడి అప్పారావు మరియు యంయల్ ఏ కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి.శ్రీధర్ పాల్గొని కార్మికులకు నూతన వస్త్రాలను బహుకరించారు.

## శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి హుండీల లెక్కింపు.



**సందేశం టైమ్స్ విజయవాడ వెస్ట్, డిసెంబర్ 10 :** విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము నందు హుండీలు తెరచి లెక్కించగా ( 26 రోజుల కాలమునకు) నగదు: రూ.5,22,18,647/- బంగారం:415 గ్రాములు,మరియు వెండి: కేజీల 7-465 గ్రాములు లభించినవి. పలు దేశాల విదేశీ కరెన్సీ వచ్చియున్నవి.యు.ఎస్.ఎ (డాలర్లు) - 489సింగపూర్ (డాలర్లు) - 109,కెనడా (డాలర్లు) - 125,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సెంట్రల్ బ్యాంక్ (దిర్హామ్స్) - 860,సౌదీ (రియాల్స్) - 125 మలేషియా - (రింగిట్) - 4,ఖతార్ (రియాల్స్) - 3,ఆస్ట్రేలియా (డాలర్లు) - 105,ఇంగ్లాండ్ (పౌండ్లు) - 10,స్టెర్లింగ్ - (పౌండ్లు) - 10 మాల్దీవులు - (రుఫియా) - 20 బహ్రెయిన్ - (డినార్) - 1 యూరోప్ - (యూరోలు) - 20 లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వీకే శీనా నాయక్ తెలిపారు.

## రెవెన్యూ సేవలు మరింత సులభతరం



**సందేశం టైమ్స్ డిసెంబర్ 9:-** రాష్ట్రంలో రెవెన్యూ సేవలు మరింత సులభతరం కావాలని, చిక్కుముడులు లేకుండా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పట్టాదారు పాస్ పుస్తకాలు సహా అన్నింటా రియల్ టైమ్‌లో ఆటో మ్యుటేషన్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ అయిన వెంటనే ఆటోమ్యూటేషన్ జరిగేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. పట్టాదారు పాస్ పుస్తకం కోసం భూ యజమానులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని, రెవెన్యూ శాఖలో ఏడాదిలోగా పూర్తి ప్రక్షాళన జరగాలని స్పష్టం చేశారు. దీనిపై ప్రతీనెలా సమీక్షిస్తానని ముఖ్యమంత్రి వెల్లడించారు. సచివాలయంలో రెవెన్యూ శాఖపై ముఖ్యమంత్రి మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశానికి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీసీఎల్ఏ అధికారులు హాజరయ్యారు. పీజీఆర్ఎస్‌లో మ్యుటేషన్, పట్టాదారు పాస్ పుస్తకాలకు సంబంధించి 1,97,915 ఫిర్యాదులు వచ్చాయని సమావేశంలో అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ల్యాండ్ నేచర్, క్లాసిఫికేషన్ సంబంధిత వివాదాల దరఖాస్తులు 1,00,835, రీసర్వే అనంతరం భూమి తగ్గిందని వచ్చిన పీజీఆర్ఎస్ దరఖాస్తులు 1,00,295, జాయింట్ ఎల్‌పీఎంలపై 2,40,479 ఫిర్యాదులు నమోదైనట్టు వివరించారు

## ప్రధానమంత్రి ఆవాస యోజన 2.0 ప్రారంభం



**సందేశం టైమ్స్ నందిగామ ,డిసెంబర్ 10.** నందిగామ పట్టణం పాత బస్టాండ్ సెంటర్ బాబు జగజీవన్ రామ్ భవనంలో మంగళవారం నాడు ప్రధానమంత్రి ఆవాస యోజన 2.0 ఘనమైన ప్రారంభోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ముఖ్యఅతిథిగా హాజరై అధికార యంత్రాంగం మరియు కూటమి నేతలతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ ‌పేదవారికి గృహ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ద్వారా 1,50,000 రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా 1,00,000 రూపాయలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులనుంచి 27,000 రూపాయలు, ఐ హెచ్ హెచ్ ఎల్ కింద 12,000 రూపాయలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ కానున్నట్టు వివరించారు. అదేవిధంగా, అర్బన్ లోకల్ బాడీ (యు ఎల్ బి) ప్రాంతాల్లో 2,50,000 మరియు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ( యు డి ఎ) ప్రాంతాల్లో 2,89,000 వరకు ప్రయోజనాలు అందనున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం పేదవాడి సంక్షేమానికి కట్టుబడి ఉందని, "కూడు%-%గూడు%-%గుడ్డ" అనే నినాదంతో సామాన్యుడి కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించిన నటసార్వభౌమ నందమూరి తారకరామారావు వారసత్వాన్ని ప్రభుత్వం కొనసాగిస్తున్నదని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అప్పుల భారంలో ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో అభివృద్ధి%-%సంక్షేమం అనే రెండు కళ్ల సిద్ధాంతంతో ముందుకు సాగుతున్నామని సౌమ్య తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, అలాగే సంబంధిత శాఖ మంత్రివర్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, డిప్యూటీ సీఎం శ్రీ పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ప్రధానమంత్రి ఆవాస యోజన 2.0 ప్రారంభంతో నందిగామ ప్రాంతంలో పేదల గృహాల కల మరింత చేరువైందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్కెటింగ్ కమిటీల ఉపాధ్యక్షులు కోగంటి వెంకట సత్యనారాయణ బాబు, లాల్ బహుదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోటా వీరబాబు, మున్సిపల్ చైర్పర్సన్ మండవ కృష్ణకుమారి, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్లు,వివిధ హోదాల డైరెక్టర్లు, నీటి సంఘం అధ్యక్షులు, వివిధ హోదాల కూటమి నేతలు, అధికార యంత్రాంగం,లబ్ధిదారులు, పార్టీ నేతలు,కార్యకర్తలు, అభిమానులు పార్టీ సానుభూతిపరులు పెద్ద ఎత్తున ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో రైతులు కుదేలౌతున్నారు, రైతుల ఆర్తనాదాలు ప్రభుత్వానికి పట్టడం లేదు



**సందేశం టైమ్స్ నందిగామ, డిసెంబర్ 10.** పత్తి, అపరాల రైతులు ను ఆదుకోవాలని, పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని మార్కెట్ యార్డ్ అధికారులకు వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు.అడ్డుకున్న పోలీసులు, ఆగ్రహం చేసిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు.రైతు సమస్యలపై మాట్లాడటానికి వెళితే... పోలీసుల అడ్డంకుల అని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు.సీఎం చంద్రబాబు నాయుడు పోలీసు ప్రభుత్వాన్ని నడుపుతున్నారు.న్యాయం చేయమని ప్రశ్నించిన వారిపై పోలీసులనుప్రయోగిస్తున్నారు .నందిగామ - కంచికచర్ల మార్కెట్ యార్డ్ లలో ఆర్భాటంగా సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి.గొప్పగా ప్రకటనలు చేసిన పాలకులు.తీరా రైతుల నుండి పత్తి కొనుగోలు చేయటానికి 100 రకాల ఆంక్షలు పెట్టి, అన్నదాతలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు .కంచికచర్లలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసి ఇప్పటివరకు రైతుల నుండి కనీసం ఒక బ్యాగ్ కూడా కొన్న పరిస్థితి లేదు.. నందిగామలో దళారులతో కుమ్మక్కై రైతును గుల్ల చేస్తున్నారు.

### అమరావతి పై గేయాని ఆవిష్కరించిన అనగాని



**సందేశం టైమ్స్ రేపల్లె, డిసెంబర్ 10,** నిజాంపట్నం మండలం అడవులదీవి గ్రామానికి చెందిన ఏమినేని రామాంజనేయులు అమరావతి రాజధానిపై రాసిన నూతన పాటను సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆవిష్కరించారు..

# జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్





**సందేశం టైమ్స్:అందోల్ నియోజకవర్గం ప్రతినిధి** జోగిపేట పట్టణ కేంద్రంలోని నెహ్రూ మెమోరియల్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో పోలింగ్ అధికారుల సమావేశానికి ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ ప్రావిణ్య హాజరవుతున్న నేపథ్యంలో భాగంగా జోగిపేట పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యులతో కలిసి ఆసుపత్రిలోని ప్రతి వార్డును కలియ తిరిగారు. రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రికి వచ్చే రోగులపట్ల ఎవరు కూడా నిర్లక్ష్యం వహించకూడదని మంచి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఆమె ఈ సందర్భంగా వైద్యులకు సూచించారు. రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంపై శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. కలెక్టర్ వెంట జోగుపేట ఆర్డిఓ పాండు, ఆర్ఎంవో డాక్టర్ అశోక్, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

# రాయికోడ్ పోలీసుల సూచనలు - రెండో విడత పోలింగ్ దృష్ట్యా అవగాహన



**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 9డిసెంబర్** రాయికోడ్ పరిధిలో రాబోయే రెండో విడత పోలింగ్ నేపథ్యంలో పోటీచేసే అభ్యర్థులు, ప్రజలు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తన నియమావళిను పాటించాలని రాయికోడ్ పోలీసులు సూచించారు. నియమావళి ఉల్లంఘనలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపశమనం ఉండదని, కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. గ్రామాల్లో అభ్యర్థులు, ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోలీసులు వెల్లడించిన ముఖ్య సూచనలు: కులాలు%-%మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రచారం ఎట్టి పరిస్థితుల్లో చేయరాదు. దేవాలయాలు, మసీదులు, చర్చిలను ఎన్నికల ప్రచారం కోసం వినియోగించడం పూర్తిగా నిషేధం. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా దూషణలు, అవమానకర పోస్టులు పెట్టరాదు. ఇతరుల పోస్టర్లు, జెండాలు, బ్యానర్లను పాడు చేయడం నేరం అని స్పష్టం చేశారు.

**అలాగే:**

ఊరేగింపులు, ర్యాలీలు, సమావేశాలకు మండల ఎమ్మార్వో అనుమతి తప్పనిసరి. పచార వాహనాల్లో లౌడ్ స్పీకర్లు వాడాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలిపారు. లౌడ్ స్పీకర్ల వినియోగం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే అనుమతించబడుతుందని చెప్పారు. ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రెండో విడత పోలింగ్ ప్రశాంతంగా సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా జోగిపేటలో సోనియమ్మ జన్మదిన వేడుక







**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 9డిసెంబర్** తెలంగాణ ప్రదాత సోనియా గాంధీ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం జోగిపేట పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులు,నాయకులు,కార్యకర్తలు సోనియా గాంధీ చిత్రపటం ముందు కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకుంటూ శు భాకాంక్షలు తెలిపారు.హనుమాన్ చౌరస్తాలోనీ దుకాణాలలో,అభిమానులకు స్వీటు తినిపిస్తూ ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భముగా మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు మాట్లాడుతూ.. సోనియా గాంధీ 2004 నుండి 2014 వరకు యూపీఏ చైర్ పర్సన్ గా పనిచేసిన సమయములో ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని ఆమె హయంలోనే పార్లమెంటులో %చీ=జు+ూ%, సమాచార హక్కు చట్టం,గృహహింస వంటి చట్టాలను ప్రవేశపెట్టి దేశప్రజల మన్ననలు పొందినారు. తెలంగాణ ప్రజల అభీష్టం మేరకు 2013 లో పార్లమెంట్లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టి బిల్లు అమలు చేయించిన ఘనత ఆమెకే దక్కుతుంది అని తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిపోతుంది అని కొనియాడారు.ఈ కార్యక్రమములో మాజీ కౌన్సిలర్ దుర్గేశ్,శరత్ బాబు ఆత్మ కమిటీ సభ్యులు చిట్యాల మధు, యాదయ్య,ఖలీద్,నాయకులు గుర్రపు కృష్ణ, బేగారి అనిల్, ఆకుల నందు,భాస్కర్,అబ్బాస్ అలీ,గోహేర్ అలీ,అక్బర్,ఖాజా,పోచయ్య, చోటు నశీర్,వెంకటేశం,వీరేశం తదితరులు పాల్గొన్నారు

# రాధ రంగా మిత్రమాండలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాలినడకన వెళ్లే భవాని భక్తులకు అల్పాహారం పంపిణీ.



**ఏలూరు జిల్లా సందేశం టైమ్స్** కైకలూరు నియోజకవర్గం కలిదిండి గ్రామం లో ఆంధ్ర తెలంగాణ రాధ రంగా మిత్రమాండలి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థపక అధ్యక్షులు పన్నాస పూర్ణ చంద్రరావు ( కాళ్లపాలెం బుజ్జి ) ఆధ్వర్యంలో విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయానికి కాలినడకన వెళ్లే భవాని భక్తులకు పాలు, సేమియ పండ్లు. పంపిణీ చేసిన కాళ్లపాలెం బుజ్జి. ఈ సందర్భంగా కాళ్ల పాలెం బుజ్జి మాట్లాడుతూ వంగవీటి రంగా దసరా పండుగ సందర్భంలో అమ్మ వారికీ ప్రభలు కార్యక్రమం నిర్వహించడం రంగా గారికి ఎంతో ఇష్టం అని అన్నారు.. ఈ కార్యక్రమం లో సర్పంచ్ సానా మీనా సరస్వతి, చిన్నిమిల్లి ఏసు, ఇసర్ల శ్రీనివాస్, చిన్నపరపు శ్రీనివాస్, గంధం శ్రీనివాసరావు, చైతన్య తదితరులు పాల్గొన్నారు..

# ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించభోం

- జోగిపేట ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్
- 11 మంది వైద్యులకు కి షోకాజ్ నోటిసులు జారీ
- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య




**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 9డిసెంబర్** ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడితే సహించేది లేదని, నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించక తప్పదని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హెచ్చరించారు.మంగళవారం జోగిపేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె హాజరు రిజిస్టర్ ను పరిశీలించగా,పలువురు వైద్యలు విధులకు హాజరు కాకపోవడం పై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**గైర్హాజరైన వైద్యులు.. కలెక్టర్ సీరియస్**

సిబ్బంది వివరాలను, డిప్యూటేషన్పై ఉన్న సిబ్బంది వివరాలను కలెక్టర్ ఆరా తీసారు. విధులకు గైరుహాజరైన 11 మంది వైద్యులకు వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిసిహెచ్ఓ ను ఆదేశించారు.ఓపి, దయాలసిస్, ఐసియుతో సహా అన్ని విభాగాలను ఆమె పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలు, పరికరాల వినియోగం, శుభ్రత, మందుల లభ్యత వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న కొంతమంది రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ప్రభుత్వ ఆసుపత్రులలో పేద ,మధ్యతరగతి కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా మెరుగైన వైద్య చికిత్సలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నామన్నారు. రోగులకు వైద్య సేవలు అందించడంలో వైద్యులు, వైద్య సిబ్బంది ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వైద్యవృత్తి ఎంతో పవిత్రమైనదని, ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్య సిబ్బంది స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ డివిజనల్ అధికారి పాండు,తహసీల్దార్ మధుకర్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు సిద్ధం: నియమావళి అమలు కట్టుదిట్టం





**సూర్యాపేట, డిసెంబర్ 9:** సూర్యాపేట జిల్లా పూర్తిగా మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉందని జిల్లా సాధారణ పరిశీలకులు, ఐఏఎస్ అధికారి రవి నాయక్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినికు తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, గ్రామపంచాయతీ ఎన్నికల పరిశీలకులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించారు. జిల్లా పరిశీలకుడు రవి నాయక్ మాట్లాడుతూ జిల్లాలో నామినేషన్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, రూట్ ప్లాన్, ప్రవర్తనా నియమావళి అమలు సహా అన్ని అంశాలను ప్రతిరోజూ ప్రత్యక్షంగా పరిశీలించామని తెలిపారు. జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ జిల్లాలో 8 మండలాల్లోని 152 గ్రామపంచాయతీలకు మొదటి విడతలో ఎన్నికలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలు, సిబ్బంది నియామకాలు, వాహనాల కేటాయింపు, రూట్ అధికారులు%-%జోనల్ అధికారులకు శిక్షణ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ వంటి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. పోలింగ్ రోజున రిపోర్టులు సేకరించేందుకు కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, పోలింగ్ అనంతరం కౌంటింగ్, ఉపసర్పంచ్ ఎన్నికల ఏర్పాట్లు కూడా చేసినట్లు వివరించారు. జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ పోలింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అంతకుముందు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఎన్నికల నిర్వహణలో ఏ లోపం లేకుండా కలెక్టర్లు మరోసారి అన్ని ఏర్పాట్లను సమీక్షించాలని సూచించారు. పోలింగ్ శాతం ప్రతి రెండు గంటలకు ఒకసారి నివేదిక ఇవ్వడం, వెబ్కాస్టింగ్, పోస్టల్ బ్యాలెట్లు, ప్రచారం ముగింపు, మద్యం నిషేధం, ఓటర్లు 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించి ఓటు వేయడం వంటి అంశాలపై సమగ్ర సమీక్ష చేశారు. ఎన్నికల ఫలితాలను టి-పోల్ ప్లాట్ఫారమ్లో అప్డేట్ చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వ్యయ పరిశీలకులు హుస్సేన్, జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, జెడ్పీ సీఈవో వి.వి. అప్పారావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఎన్నికలపై 10,11 - 13,14 - 16,17 తేదీలకు స్థానిక సెలవులు: సూర్యాపేట కలెక్టర్ ప్రకటన



**సూర్యాపేట, డిసెంబర్ 9** గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో, పోలింగ్ రోజు మరియు పోలింగ్కు ముందు రోజు స్థానిక సెలవు ప్రకటించినట్టు జిల్లా కలెక్టర్ %  % జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదటి విడత ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీల పరిధిలో డిసెంబర్ 10, 11 రెండో విడత ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో డిసెంబర్ 13, 14 మూడో విడత ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీలలో డిసెంబర్ 16, 17 తేదీలను స్థానిక సెలవుదినాలుగా ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం వినియోగించుకునే శాఖలు, గ్రామపంచాయతీ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పబ్లిక్ అండర్టేకింగ్ సంస్థల సిబ్బందికి ఈ స్థానిక సెలవు వర్తిస్తుందని ఆయన వివరించారు. అయితే, ఈ ప్రకటించిన స్థానిక సెలవులు ట్రెజరీలు మరియు సబ్-ట్రెజరీలకు వర్తించవని కలెక్టర్ స్పష్టం చేశారు.

# పవన్ కళ్యాణ్ లాంటి నిజాయితీ పరుడైన నాయకుడుంటే రాష్ట్రమే కాదు దేశం అభివృద్ధి చెందుతుంది

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద కళలు సృజనాత్మకత అకాడమీ చైర్మన్, జనసేన పార్టీ పాడేరు అసెంబ్లీ మరియు అరకు పార్లమెంట్ ఇంచార్జ్ డా!! వంపూరు గంగులయ్య...**



**అల్లూరి సీతారామరాజు జిల్లా సందేశం టైమ్స్** జానపద కళలు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డా!! వంపూరు గంగులయ్య మాట్లాడుతూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బూడి ముత్యాల నాయుడు పంచాయతీరాజ్ శాఖ మంత్రులుగా చేసినప్పుడు బదిల్లి కూడా లంచాలు పిండారని, చిన్నపాటి పంచాయతీ సెక్రటరీ స్థాయికి వసూలు చేశారని విమర్శించారు... అప్పట్లో వైసీపీ వాళ్ల పేషీలు అవినీతి కంపు కొట్టాయి..10 వేల ప్రమోషన్లకు టారిఫ్ కార్డులు పెట్టేసేవారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు... నిజాయితీ పరుడైనా నాయకుడు బాధ్యతల్లో ఉంటే ఎలా ఉంటుందో తొలిసారిగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిరూపించారని, పంచాయతీ సెక్రటరీ నుంచి ఎంపీడీవో స్థాయి వరకూ అందరికి ప్రమోషన్స్ ఇచ్చారనీ ఇలాంటి గొప్ప నాయకుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉండడం అందరూ గర్వించదగ్గ విషయం అని తెలిపారు. పారదర్శకతకు ప్రశంసలు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ బాధ్యతలు చూస్తూ ఉద్యోగులకు ప్రమోషన్స్ కల్పించిన విధానంలో పారదర్శకత ఉండటంపై అంతటా ప్రశంసలు లభిస్తున్నాయి అని పాలనలో ప్రజలంతా ఆశించిన మార్పు ఇదే కదా అని సంతోషాన్ని వ్యక్తం చేశారు...



సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దిన పత్రిక బుధవారం 10 - 12 - 2025

# విద్యార్థినిపై ఆటో డ్రైవర్ అత్యాచారం




**తిరుపతి జిల్లా సందేశం టైమ్స్** తిరుపతిలో ఓ దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఎస్వీ పాలిటెక్నిక్ కాలేజీలో చదువుతున్న మైనర్ విద్యార్థినిపై ఒక ఆటోడ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్న ఈ విద్యార్థిని వేరే హాస్టల్‌కు మారే క్రమంలో ర్యాపిడో ఆటో టాక్సీలో రిజిస్టర్ అయిన ఆటో డ్రైవర్ సాయికుమార్ పరిచయమయ్యాడు. వారి మధ్య పరిచయం పెరగడంతో సదరు ఆటో డ్రైవర్‌ను విద్యార్థిని కొంత ఆర్థిక సహాయం కోరింది. దీంతో అతను ఈ అవకాశాన్ని అలుసుగా తీసుకున్నాడని పోలీసులు అన్నారు. బాలికను తెలివిగా మభ్యపెట్టి తన గదికి తీసుకెళ్లిన అతను అక్కడ తన నీచ ఈ దారుణానికి ఒడిగట్టినట్లు చెప్పారు. అత్యాచార యత్నానికి సంబంధించిన విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించినట్లు పేర్కొన్నారు. ఈ హేయమైన చర్య తర్వాత బాధితురాలు తన స్నేహితురాలితో కలిసి ధైర్యం చేసి అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. బాధిత విద్యార్థిని ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. నిందితుడు సాయికుమార్‌పై క్రైమ్ నెంబర్ 448/2025 కింద, పోక్సో చట్టం 2012 ప్రకారం కేసు నమోదు చేశారు. పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. మైనర్ బాలికపై జరిగిన ఈ అఘాయిత్యం తిరుపతిలో కలకలం సృష్టించింది. ఈ చట్టం పిల్లలపై జరిగే లైంగిక నేరాల నుండి వారిని రక్షించడానికి ఉద్దేశించబడిందని పోలీసులు తెలిపారు. అయితే ఈ దారుణ ఘటనపై విద్యాసంస్థల విద్యార్థులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో నిందితుడిని త్వరగా పట్టుకుని, కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాలు, పౌర సమాజం ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థినుల భద్రత, ముఖ్యంగా హాస్టల్స్, ప్రయాణ సమయంలో వారి రక్షణకు సంబంధించి తల్లిదండ్రులలో, అధికారులలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటువంటి చర్యలను ఉపేక్షించేది లేదని.. నిందితులపై చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

# భవాని దీక్షల విరమణ సందర్భంగా శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల టెంపుల్ పరిసర ప్రాంతాలను మరియు గిరిప్రదక్షణ ప్రాంతాలను స్వయంగా పరిశీలించిన నగర పోలీస్ కమీషనర్ శ్రీ ఎస్.వి.రాజ శేఖర బాబు.



**విజయవాడ సందేశం టైమ్స్** ది.11.12.2025 నుండి ప్రారంభమయ్యే భవాని దీక్షల విరమణ కార్యక్రమం ది.15.12.2025న జరిగే మహా పూర్ణాహుతి కార్యక్రమంతో ముగుస్తుంది. రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు అమ్మవారి మాలాధారణ చేసి దీక్షా విరమణ కోసం విజయవాడకు వస్తారు. ఈ నేపథ్యంలో ఈ రోజు పోలీస్ కమీషనర్ శ్రీ ఎస్.వి.రాజ శేఖర బాబు, టెంపుల్ ఈ.ఓ., ఇతర అధికారులతో కలిసి టెంపుల్ పరిసర ప్రాంతాలను, గిరి ప్రదక్షణ ప్రాంతాన్ని, స్నాన ఘాట్లను హోమగుండాలు మరియు విరుముడుల స్టాండ్ల ఏర్పాటు ప్రదేశాలను స్వయంగా నడుచుకుంటూ పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. గిరిప్రదక్షణ సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా పార్కింగ్ ఏర్పాట్లపై సూచనలు చేయడంతో పాటు, దర్శన సమయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. క్యూలైన్లను, దర్శనం అనంతరం భక్తులు వెళ్లే మార్గాలను కూడా పరిశీలించి పటిష్ట మైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సారి భవాని దీక్షా విరమణను అత్యుత్తమంగా నిర్వహించేందుకు ఎక్కడా ఎటువంటి అవంచనీయ సంఘటనలు జరుగకుండా ఉండే విధంగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మోడల్ గెస్ట్ హౌస్ నందు ఏర్పాటు చేస్తున్న కంట్రోల్ రూం ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్, డి.సి.పి. శ్రీమతి షీరిన్ బేగం ఐ.పి.ఎస్, ఈ.ఓ.శ్రీ శ్రీనా నాయక్, ఏ.డి.సి.పి. శ్రీ జి. రామ కృష్ణ, ఏ.సి.పి.లు, శ్రీ ఎన్.వి.దుర్గారావు, శ్రీ డి.పావన్ కుమార్, శ్రీ రామ చంద్రరావు, ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులు పండించిన ధాన్యం పూర్తిగా కొనుగోలు చేస్తాం : యార్లగడ్డ



**గన్నవరం సందేశం టైమ్స్** రైతుల వద్ద ఉన్న ధాన్యం చివరి గింజ వరకు మద్దతు ధరకే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రైతులకు భరోసా ఇచ్చారు. మంగళవారం సాయంత్రం గన్నవరం మండలం పురుషోత్తపట్నం గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి రైతు సేవా కేంద్రం ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను, రైతులకు ధాన్యం చెల్లింపులను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలోని లక్ష్మీ మారుతి రైస్ మిల్లును సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ గత నెలలో వచ్చిన మెంతా, దిత్వా తుఫాన్ ల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, తుఫాన్ భారీ నుండి పంటను రక్షించుకునేందుకు యంత్రాల సాయంతో వరి కోతలు పూర్తి చేసారని యంత్రాలతో కోసిన ధాన్యం లో తేమ శాతం అధికంగా ఉంటుందన్నారు. రైతులు దాన్యాన్ని పూర్తిగా ఎండబెట్టాలని తేమశాతం 17 లోపు వచ్చే వరకు అరబెట్టాలని సూచించారు. 17 లోపు తేమశాతం ఉంటే ప్రభుత్వ మద్దతు ధర బస్తాకి రూ. 1777లు వస్తుందన్నారు. బాపులపాడు మండలంలో 32,693 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాల్సి ఉండగా ఇప్పటివరకు 4,855 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. గన్నవరం మండలంలో 31,316 మెట్రిక్ టన్నుల ధాన్యానికి గాను 6,945 మెట్రిక్ టన్నులు, ఉంగుటూరు మండలంలో 69,470 మెట్రిక్ టన్నులకు గాను 18,968 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించినట్లు యార్లగడ్డ వివరించారు. ప్రభుత్వం సేకరించిన ధాన్యానికి 48 గంటల్లో రైతులు ఖాతాలో డబ్బు జమ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టవద్దని అధికారులకు సూచించారు. తేమశాతం విషయంలో స్వల్ప తేడా ఉన్నప్పటికీ రైతులకు మద్దతు ధర లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, తహసిల్దార్ శివయ్య, ఎంపీడీవో స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీలు ప్రవేటికరణకు వ్యతిరేకంగా నియోజకవర్గ వ్యాప్తంగా కోటి సంతకాలు సేకరణ పూర్తి..





**గన్నవరం సందేశం టైమ్స్** కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రవేటికరణ చేయాలనే ఆలోచన ఉపసంహరించుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు గన్నవరం నియోజకవర్గ వైసీపీ నాయకులు. నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించిన కోటి సంతకాల పత్రాలను మంగళవారం గన్నవరం వైసీపీ కార్యాలయంలో సేకరించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండల అధ్యక్షులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాయకులు ఆర్.వి.ఆర్, శీలం రంగారావు, నక్కా గాంధీ, జడ్పీటీసీలు అన్నవరపు ఎలిజిబెత్ రాణి, కొమరవల్లి గంగాభవాని, అనగాని చైతన్యలు మాట్లాడుతూ పేదవాడు మెడికల్ కాలేజీలో విద్యను అభ్యసించాలన్న కలలను కూటమి ప్రభుత్వం నిరుగార్చే విధంగా వ్యవహరించడం దుర్మార్గం అన్నారు. చంద్రబాబు, లోకేష్ ప్రతిపక్షంలో ఉంటే ఒకమాట అధికారంలో ఉంటే మరో మాట మాట్లాడడం అలవాటుగా మారిందన్నారు. గతంలో లోకేష్ కి జ్వరం వస్తే ఉస్మానియా, నిమ్స్ కి వెళ్ళేవాడినన్న సంగతి మర్చిపోయావా అని ప్రశ్నించారు. నాడు ప్రభుత్వ హాస్పిటల్స్ మీద ప్రేమలు గుప్పించి నేడు పేదవాడి కలలను చేరిపివేసే ధోరణిలో ఉన్న ప్రభుత్వ విధానాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఒకేసారి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు తీసుకురావడం గొప్ప విషయం అన్నారు. జగన్ మోహన్ రెడ్డి ప్రతి పేదవాడికి విద్య ద్వారా ఆర్థిక బలవంతులను చేయాలనే ఉద్దేశ్యంతో 17 మెడికల్ కాలేజీలు తీసుకువచ్చి వాటిలో 5మెడికల్ కాలేజీలు పూర్తి చేసి వైద్య విద్యను అందించిన ఘనత జగన్ మోహన్ రెడ్డి ది అన్నారు. మిగిలిన కాలేజీలు కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తే జగన్ మోహన్ రెడ్డికి ఎక్కడ పేరు వస్తుందోననే ఉద్దేశ్యంతో చంద్రబాబు పీపీపీ విధానాన్ని తీసుకువచ్చాడని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలు పై చేస్తున్న కుట్రకు వ్యతిరేకం పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు గన్నవరం మాజీ శాసనసభ్యులు డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ ఆదేశాలు మేరకు నియోజకవర్గ పరిధిలోని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాల్లో కోటి సంతకాలు సేకరణకు మంచి స్పందన వచ్చిందన్నారు. నాలుగు మండలాల్లో 40 వేలు సంతకాలు సేకరించడం జరిగిందన్నారు. గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు చేసారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేటికరణ విధానాన్ని ఉపసంహరించుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సంతకాలు సేకరించిన పత్రాలను బుధవారం ఉదయం వంశీ ఆధ్వర్యంలో గన్నవరం పార్టీ కార్యాలయం నుండి జిల్లా పార్టీ కార్యాలయానికి పంపించడం జరుగుతుందన్నారు. ఆ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గన్నవరం, ఉంగుటూరు మండల అధ్యక్షులు నీలం ప్రవీణ్ కుమార్, వింత శంకర్ రెడ్డి, గన్నవరం పట్టణ అధ్యక్షుడు మోదుగుమూడి వెంకటేశ్వరావు, ఎంపీపీలు యర్రగొర్ల నగేష్, వడ్లమూడి సరోజినీ, నాయకులు యర్కరెడ్డి నాగిరెడ్డి, దండు సుబ్రహ్మణ్యరాజు, కోడెబోయిన బాబీ, సలివేంద్ర రామకృష్ణ, గొన్నూరు సీమయ్య, పొలిమేట్ల నాని, మేచినేని బాబు, చెన్నుబోయిన శివయ్య తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణాజిల్లా నూతన డీఈవోగా యువి సుబ్బారావు.



**మచిలీపట్నం సందేశం టైమ్స్** కృష్ణాజిల్లా నూతన డిఈఓ గా యూవీ సుబ్బారావు ను రాష్ట్ర విద్యాశాఖ నియమించింది. రాష్ట్రంలో కొంతమంది డి ఈ ఓ ల బదిలీలల్లో భాగంగా సుబ్బారావు కృష్ణాజిల్లాకు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేస్తున్న పీవీజే రామారావు పల్నాడు జిల్లాకు డిఈఓ గా బదిలీ అయ్యారు. 2026 మార్చి నెలలో 10వ తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని, రాష్ట్రంలో ఎక్కువ భాగం డీఈఓ ల బదిలీ జరిగింది. రాష్ట్ర విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకుని డీఈవోల బదిలీపర్వం నిర్వహించింది. పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని సదుద్దేశంతో, రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు భోగట్ట. సుబ్బారావు గతంలో ఈ జిల్లాలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారిగా బందరు డివిజన్ లో పని చేసి మంచి పేరు తెచ్చుకున్నారు. సౌమ్యుడు, వివాదరహితునిగా సుబ్బారావుకి పేరు ఉంది. నూతన డిఈఓ సుబ్బారావు హయాంలో పదవ తరగతి పరీక్ష ఫలితాలు 2026 లో విజయడంకాతో, జిల్లాను సుబ్బారావు అగ్రభాగంలో నిలబెడతారని ఆశిద్దాం.

# పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న.. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



**నందివాడ డిసెంబర్ 09 సందేశం టైమ్స్** నందివాడ మండలం పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నందివాడ కే కన్వెన్షన్ ప్రాంగణంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫెలోషిప్ పెద్దలు ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే రాము... క్యాండిల్ సర్వ్ చేస్తూ క్రైస్తవ విశ్వాసులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవ సోదరులందరూ క్రిస్మస్ వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము ఆకాంక్షించారు. దేవదేవుడైన క్రీస్తు దేవుడు కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, క్రిస్టియన్ సెల్ అధికార ప్రతినిధి కొడాలి విజయ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవి కుమార్, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్ రావు, సీతయ్య, లోకేష్, అంజి రెడ్డి, సాల్మన్, యేసుపాదం, జనసేన నాయకులు కొండపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ఫెలోషిప్ పెద్దలు రత్నాకర్, హొసన్నా మినిస్ట్రీస్ యెహను, జోషవ, సతీష్, రవి, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

# దేశసేవలో భాగస్వామ్యమే ఎన్. ఎస్. ఎస్ లక్ష్యం






**చోడవరం డిసెంబర్ 9 సందేశం టైమ్స్** ఎన్. ఎస్. ఎస్ యూనిట్ 2 క్యాంపులో అంకుపాలెంలో స్వచ్ఛఆంధ్ర స్వర్ణ ఆంధ్ర లో భాగంగా విద్యార్థులను దేశసేవలో భాగ స్వామ్యం చేయడమే జాతీయ సేవా పథకం(ఎనఎస్ఎస్) ఏర్పాటు లక్ష్యమని అంకుపాలెం గ్రామ ప్రెసిడెంట్ ఎన్ పరమేశ్వరి అన్నారు. చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఎన్ ఎస్ ఎస్ యూనిట్ -2 అంకుపాలెం లో ప్రభుత్వ డీగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి కిరణ్ కుమార్, పోగ్రామ్ ఆఫీసర్ బి పిచ్చమ్మ ఆధ్వర్యంలో ఎన్ ఎస్ ఎస్ సేవా కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన అంకుపాలెం గ్రామ ప్రెసిడెంట్ ఎన్ పరమేశ్వరి, మాట్లాడుతు ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు ద్వారా ఎన్నో ఉచిత సేవలు అందిసస్తున్నట్టు తెలిపారు. అనంతరం అంకుపాలెం గ్రామ ప్రెసిడెంట్ పరమేశ్వరి దోమల నివారణ మొక్క లెమన్ గ్రాస్ మొక్కలు నాటినారు మరియు మొక్కలను ఇంటింటికీ పంచినారు, ఈ మేరకు వాలంటీర్ల తో నిర్వహించారు. కార్యక్రమం లో ఎన్ ఎస్ ఎస్ పోగ్రామ్, 28 మంది బాలికలు, 22 మంది బాలురు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా నర్సీపట్నం శాఖా గ్రంథాలయం డిప్యూటీ గ్రంథ పాలకులు శ్రీమతి దమయంతి పాల్గొని ఈ డిజిటల్ లైబ్రరీ గ్రంథాలయాల ప్రాముఖ్యతను గురించి మరియు రాష్ట్రీయ ఈ పుస్తకాల య యాప్ లో ఎలా నమోదు చేసుకోవాలి అనే విషయాన్ని విద్యార్దిని విద్యార్థులచే నమోదు చేయించి చూపించారు.

# ముమ్మిడివరం గురుకులంలో ఉద్రిక్తత



**ముమ్మిడివరం సందేశం టైమ్స్** డా. బి.ఆర్. అంబేద్కర్ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముమ్మిడివరంలోని బాలికల వసతిగృహంలో ఇటీవల పదో తరగతి విద్యార్థిని అదృశ్యమైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటన అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి. శారద, ఉపాధ్యాయినీ లోవ కుమారిలను విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేశారు. ఈ ఇద్దరి సస్పెన్షన్‌ను నిరసిస్తూ గురుకుల పాఠశాల విద్యార్థినులు ఒక్కసారిగా ఆందోళనకు దిగారు. తరగతులను బహిష్కరించిన వారు, పాఠశాల ముందు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ కావడంతో పాఠశాల నుంచి వెళ్లేందుకు ప్రయత్నించిన ప్రిన్సిపాల్ డి. శారదను విద్యార్థినులు అడ్డుకున్నారు. ఆమె వెళ్లొద్దంటూ కోరుతూ కొందరు విద్యార్థినులు కన్నీరు పెట్టుకున్నారు. ఓ విద్యార్థిని చేసిన తప్పిదానికి, తమను బాగా చూసుకుంటూ, క్రమశిక్షణతో బోధన చేసిన ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం అన్యాయమని విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సస్పెన్షన్‌లను వెంటనే ఉపసంహరించాలంటూ వారు డిమాండ్ చేస్తున్నారు. సస్పెన్షన్ నిర్ణయం వెనక్కి తీసుకునే వరకు ఆందోళన విరమించేది లేదని విద్యార్థినులు స్పష్టం చేశారు. ప్రస్తుతం గురుకుల పాఠశాల పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times3-82, Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508206Gmail : sandeshamtimes@gmail.comWebsite: https://sandeshamtimes.comPublisher : MADDINENI NAGESWARA RAOAddress104, HILLS APARTMENT, Press (Name & Address)SUNDAY PRINTING PRESS3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH-522006